జ్వరదడ

- వర్షాలు, వరదలతో విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు
- బెంబేలెత్తుతున్న వివిధ గ్రామాల ప్రజలు
- జల దిగ్బంధనంలోనే లోతట్టు ప్రాంతాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు


కేశనకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని జీజీ పేటలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

ఐ.పోలవరం: ఒకవైపు వర్షాలు.. మరోవైపు గోదావరి వరద. దాదాపు మూడు వారాలుగా ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో ఎటు చూసినా వర్షపు నీరు.. లేదా ముంపుతో పలు లోతట్టు గ్రామాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. అటు వర్షపు నీరు.. ఇటు వరద నీరు ఇళ్లను చుట్టుముట్టాయి. తోటలు, పొలాల్లో ముంపునీరు చేరింది. చప్ప నీరు కావడంతో వీటిలో దోమల సంతతి వేగంగా పెరుగుతోంది. వీటితో పాటు వైరల్ జ్వరాలూ గణనీయంగా పెరుగుతున్నాయి. జలుబు, జ్వరం, వైరల్ జ్వరాలు, కామెర్లు, డెంగీ, మలేరియా, డయేరియా వంటి రోగాలు ఎక్కువగా ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పీహెచ్‌సీల్లో రోగ పీడితుల కేసులూ పెరుగుతున్నాయి. గ్రామాలను చుట్టుముడుతున్న విష జ్వరాలతో జనం బెంబేలెత్తుతున్నారు.

పెరిగిన జ్వర పీడితులు

ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, జి.వేమవరం పీహెచ్‌సీల పరిధిలో గతంలో రోజుకు 50 నుంచి 60 వరకు ఓపీలు ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 100 నుంచి 110 వరకు నమోదవుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో కాట్రేనికోన మండలంలో కాట్రేనికోన పీహెచ్‌సీలో గతంలో 80 ఓపీలుండగా, ప్రస్తుతం వంద వరకు పెరిగింది. అలాగే పల్లంకుర్రు పీహెచ్‌సీ పరిధిలో 60 వరకు ఉన్న ఓపీ, 80కి చేరింది. ముమ్మిడివరం, తాళ్లరేవు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అమలాపురం నియోజకవర్గం పరిధిలో ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురంతో పాటు, అమలాపురం పట్టణంలో జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉంది.

రెండు సార్లు వరద పోటు

వరద ప్రభావిత ప్రాంతాల్లో గోదావరికి ఈసారి రెండుసార్లు వరద పోటు తగిలింది. ఈ కారణంగా సుమారు 15 రోజుల పాటు ఏటిగట్టు దిగువన లంక గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. మండలంలో కేశనకుర్రు, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.మూలపొలం, గోగుల్లంక, భైరవపాలెం, అల్లవరం మండలం బోడసుకుర్రు మత్స్యకార కాలనీ, ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేల్లంక, గురజాపులంక, కూనాలంక, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు రేవుతో పాటు, బలుసుతిప్ప, కొత్తపాలెం వంటి మత్స్యకార గ్రామాలపై వరద ప్రభావం ఎక్కువగా ఉంది. అయితే రోగాల బారిన పడిన వారిలో చాలా తక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారు. ఇంతకు రెండు, మూడు రెట్ల బాధితులు ఇళ్ల వద్దనే ఆర్‌ఎంపీల ద్వారా వైద్యం చేయించుకుంటున్నారు.

పారిశుధ్యం అంతంతమాత్రం

ముంపు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లంక గ్రామాల్లో పూర్తి స్థాయిలో ముంపు వీడకపోవడంతో పారిశుధ్య నిర్వహణ కూడా పంచాయతీ సిబ్బందికి కష్టంగా మారింది. వరద ముంపు నీరు కుళాయిలు, బావులు, చేతి పంపుల చుట్టూ చేరడం, నీరు దుర్గంధం వెదజల్లడం వంటి కారణాల వల్ల కూడా రోగాలు ప్రబలుతున్నాయంటున్నారు.

వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం

వరద ముంపు బారిన పడిన ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు, జలుబు, జ్వరం, కామెర్లు, డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. డయేరియా వ్యాధి లక్షణాలు కనిపిస్తే, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కలిపిన నీటిని తాగాలి. ఇంటి పరిసరాలలో ముంపునీరు లేకుండా చూసుకోవాలి. ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాం. వారి నుంచి కూడా వైద్య సేవలు పొందవచ్చు.

– డాక్టర్ ఎంఎస్ రాజేష్‌బాబు, వైద్యాధికారి, కేశనకుర్రు పీహెచ్‌సీ

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న దుర్గారావు దొర

ఉప్పలగుప్తం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర ఆదేశించారు. మండలంలోని గొల్లవిల్లి గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు సిబ్బందితో సర్వే చేయిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 24 డెంగీ కేసులు నమోదయ్యాయని, వారంతా సురక్షితంగా కోలుకున్నారని వివరించారు. ప్రస్తుతం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ప్రతి తల్లికి అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి ఎల్.నాగార్జున ఉన్నారు.

క్లుప్తంగా

జగన్‌ను కలిసిన పార్టీ నేతలు


పార్టీ అధినేత జగన్‌తో నాయకులు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం కలిశారు. వీరిలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు(బాబీ) తదితరులున్నారు. ప్రస్తుతం వర్షాలు, వరదల కారణంగా వ్యవసాయం చేస్తున్న రైతులు పడుతున్న కష్టాలను అధినేత జగన్‌కు వివరించామని వారు స్థానిక విలేకర్లకు తెలిపారు. కష్టకాలంలో రైతులకు ధైర్యం నింపి, తోడుగా ఉండాలని ఆయన సూచించారని వివరించారు.

ఘనంగా లక్ష రుద్రాక్ష పూజ


లక్ష రుద్రాక్ష పూజలందుకుంటున్న కురంగేశ్వర స్వామివారు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పాతకోరంగిలో ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వర స్వామివారికి శుక్రవారం లక్ష రుద్రాక్ష పూజలను వైభవంగా నిర్వహించారు. పవిత్ర మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఆలయ అర్చకులు కేఆర్‌కే సాయి ప్రసాద్ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష రుద్రాక్షలతో స్వామివారికి విశేష పూజ చేశారు.

పేద కుటుంబానికి సాయం


నాగమణి కుటుంబానికి సాయం అందిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: బోడసకుర్రు టిడ్కో గృహాల సముదాయంలో నివసిస్తున్న శ్రీకాళం నాగమణి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో ఆ పేద కుటుంబానికి అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి శుక్రవారం తనవంతు సాయం అందించారు. ప్రభుత్వం అందించిన సామాజిక పింఛను అందిస్తూనే, దాంతో పాటు బియ్యం బస్తా, చీర, నిత్యావసర వస్తువులను సమకూర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

అమాపురం రూరల్: పిల్లల ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని బండారులంక పీహెచ్‌సీ వైద్యాధికారి వాసు నాయక్ అన్నారు. ఎ.వేమవరప్పాడు సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరించారు. సర్పంచ్ పందిరి విజయ, కార్యదర్శి తేజ పాల్గొన్నారు.

విధిగా పిల్లలకు పట్టాలి

ముమ్మిడివరం: పిల్లలకు విధిగా తల్లి పాలను పట్టడం ద్వారా వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చని వైద్యాధికారి యోగితా రాణి అన్నారు. శుక్రవారం స్థానిక పోలమ్మ చెరువు పీహెచ్‌సీలో తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. తల్లి పాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

డెంగీ ప్రబలకుండా చర్యలు

అమలాపురం రూరల్: రెడ్డిపల్లి గ్రామంలో డెంగీ ప్రబలుతున్న కారణంగా ముందు జాగ్రత్త చర్యగా గుంతలు, పంట బోదెల్లో మలాథిన్ మందుతో తయల్ బాల్స్ వేశారు. సర్పంచ్ కరాటం ప్రసన్నప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యారోగ్య, సచివాలయ ఉద్యోగులు తయిల్ బాల్స్‌ను సిద్ధం చేసి గుంతల్లో వేశారు. ముగ్గు, బ్లీచింగ్ చల్లి, పొగ స్ప్రే చేశారు.

ఘనంగా పింగళి జయంతి

యానాం: జాతీయ జెండా రూపశిల్పి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫెర్రీ రహదారిలో ఉన్న పింగళి వెంకయ్య విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు నివాళులర్పించారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సై మురుగునాందన్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుల పంపిణీ

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 75 మంది రైతులకు కౌలు రైతు కార్డులను మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు.

నెరవేరిన మాదిగల చిరకాల ఆకాంక్ష


పాదయాత్ర చేస్తున్న మాదిగ నాయకులు

ఐ.పోలవరం: దాదాపు మూడు దశాబ్దాలుగా మాదిగలు సాగించిన సుదీర్ఘ పోరాటంతో వారి చిరకాల ఆకాంక్ష నెరవేరిందని మాదిగ నాయకులు అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో మండలంలోని మాదిగలు శుక్రవారం స్థానిక కొమరగిరిలోని బాబూ జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, అక్కడి నుంచి పాదయాత్ర నిర్వహించారు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని, ఎందరో మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టులో తీర్పు వచ్చిందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సవరం భైరవ మూర్తి, మండల అధ్యక్షుడు యూవీ కిషోర్‌బాబు, మన్యం, సవరపు ప్రకాష్, సవరపు రమణ, వీధి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి వినతి


సూర్యప్రకాశానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: ప్రస్తుతం ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలపై ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అమలాపురం మండల శాఖ ప్రతినిధులు శుక్రవారం ఉప విద్యా శాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశానికి వినతిపత్రం అందించారు. జీఓ 117 రద్దు చేసి.. పాత పద్ధతిలో పాఠశాలలు కొనసాగించాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలల్లో రెండు మీడియంలు సమాంతరంగా కొనసాగించడం, మధ్యాహ్న భోజన పథకం మెను స్థానికతకు తగినట్టుగా అమలు చేయాలని కోరారు. సంఘ రాష్ట్ర కౌన్సిలర్ మేరీరూత్, మండల అధ్యక్షుడు పీవీఎస్ చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీఎస్ గౌడ్, నాయకులు కె.కిషోర్‌కుమార్, ఎం.రవికుమార్, ఎన్ వెంకటేశ్వరరావు, పి.గణేష్‌కుమార్, జె.గౌతమ్, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ఆ తీర్పును వెనక్కి తీసుకోవాలి

విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వడ్డి ఏడుకొండలు

తాళ్లరేవు: దళితులను వర్గీకరణ పేరుతో విడగొట్టేందుకు వీలుగా ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు వెనక్కి తీసుకోవాలని విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు కోరారు. శుక్రవారం తాళ్లరేవులో మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ఎస్సీ అంటే.. షెడ్యూల్ క్యాస్ట్‌లో ఉన్న వారంతా ఒకే జాబితాలో వ్యక్తులన్నారు. వాళ్లను వర్గీకరించి, విడదీసి, వారి ఐక్యతను దెబ్బకొట్టేలా రాజకీయ కుట్ర జరుగుతుందన్నారు. ఎస్సీల మధ్య అగాధాన్ని సృష్టించి వేడుక చూస్తున్న మతతత్వ పార్టీలకు సరైన సమయంలో బుద్ధి చెబుతామన్నారు. ప్రభుత్వానికి సత్తా ఉంటే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి, ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దళిత సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డి రెడ్డిబాబు, వాకపల్లి చిరంజీవి, పోతుల రత్నకుమారి, జక్కల చిన్నారి, నేరెడిమిల్లి శివాజీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పశువుల మేత అందజేత


పశువుల మేతను అందజేస్తున్న అధికారులు

ఐ.పోలవరం: గోదావరి వరదల కారణంగా పశువులకు ఉచితంగా మేతను శుక్రవారం అందించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కేశనకుర్రుపాలెంలో టీఎంఆర్ మేత రెండు వందల పశువులకు 25 కేజీల చొప్పున ఐదు వేల కేజీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీర సత్యకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్బరాజు, ఎంపీటీసీ సభ్యులు విజయరామరాజు, వనచర్ల వెంకటేశ్వరరావు, విశ్వనాథరాజు, కేశవ రామరాజు, కలిదిండి అప్పల నరసింహారాజు, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేఎస్‌వీవీఎస్ మూర్తి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ క్రీడలు


చదరంగంలో తలపడుతున్న బాలికలు

యానాం: జోనల్ స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలను విద్యా శాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ ప్రారంభించారు. చెస్ పోటీల్లో తొలి రోజు అండర్–14, 17 బాలికలు పోటీ పడ్డారు. అండర్–14 బాలికల విభాగంలో రీజెన్సీ స్కూల్, పరంపేట అంబేద్కర్ ప్రభుత్వ హైస్కూల్, గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లు వరుస స్థానాలు పొందాయి. అండర్–17 బాలికల్లో వరుసగా రీజెన్సీ, శారదా ఎయిడెడ్ స్కూల్ గెలుచుకున్నాయి. ఫిజికల్ డైరెక్టర్ పీవీఎస్ ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినకోటి సన్యాసిరావు, పీఈటీలు పాము సత్యనారాయణ, భాస్కర్, రమేష్, మోహన్, చంద్రశేఖర్, వరప్రసాద్, వెంకన్న, విష్ణు పోటీలను పర్యవేక్షించారు.

కళాశాల అభివృద్ధికి కృషి


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల

ముమ్మిడివరం: ప్రభుత్వ కళాశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ముమ్మిడివరం మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ జూనియర్ కళాశాలకు అవసరమైన వసతులు సమకూర్చుతామన్నారు. గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.

రక్షణ చర్యలు చేపడతాం

నదీ కోతకు గురవుతున్న లంక గ్రామాల్లో రక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని జల వనరుల శాఖ అధికారులను ఎమ్మెల్యే దాట్ల ఆదేశించారు. ఆయా గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. వివేకానంద వారధి, కూనాలంక, లంకాఫ్ ఠానేల్లంక, సలాదివారిపాలెం గ్రామాల్లో నదీ కోతకు గురవుతున్న ప్రదేశాలను పరిశీలించారు.

చల్లగా దీవించు.. శాకంబరి మాతా


శాకంబరిదేవిగా దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు


ప్రత్యేకంగా అలంకృతులైన అమలాపురం వైష్ణవీ కనకదుర్గ అమ్మవారు


శాకంబరుని అలంకరణలో బండారులంక వేంకటేశుడు

అమలాపురం టౌన్: ఆషాఢ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారు శాకంబరిదేవిగా అలంకృతులయ్యారు. అమ్మవారి విగ్రహాన్నే కాకుండా, మొత్తం ఆలయాన్ని దాదాపు టన్ను కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరించారు. భక్తులు కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల పండ్లను సమకూర్చారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, కమిటీ ప్రతినిధులు, అర్చకులు, భక్తులు అమ్మవారిని శాకంబరిదేవిగా తీర్చిదిద్దారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు శుక్రవారం కావడంతో పాటు, శాకంబరిదేవిగా అలంకృతులైన అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

వైష్ణవీ కనకదుర్గ అమ్మవారు

స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉపాలయంగా ఉన్న వైష్ణవీ కనకదుర్గ అమ్మవారు కూడా శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిదేవిగా అలంకరించారు. దేవస్థానం చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన అధ్యక్షుడు ఫణి దంపతుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

శాకంబరునిగా వేంకటేశుడు

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలోని పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారిని శుక్రవారం కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో శాకంబరునిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో గోవింద నామాలను కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. పాండురంగ విఠల భజన మండలి, శ్రీనివాస అన్నదాన మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక వేదికపై విశేషంగా అలంకరించిన పద్మావతి, అలివేలు అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.

మావుళ్లమ్మ అమ్మవారు


మావుళ్లమ్మ అమ్మవారు

అమలాపురం రూరల్: ఇందుపల్లిలో ఉన్న గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారు శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా భక్తులు అమ్మవారిని పలు రకాల కాయగూరలతో అలంకరించారు.

ఆశా వర్కర్ల జీతాల పెంపు

యానాం: ఆశా వర్కర్లకు నెలావారీ ఇచ్చే జీతాలను పెంచుతూ జీఓ జారీ అయినట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. యానాం నియోజకవర్గ పరిధిలో పని చేసే ఆశా వర్కర్లకు జీతాలు పెంచేలా గత అసెంబ్లీ సమావేశాల్లో తాను సైతం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లానని గుర్తుచేశారు. దీనికి స్పందించి ప్రభుత్వం వారి జీతాలను రూ.10 వేలు చేసిందన్నారు. ఎన్‌హెచ్‌ఎం గౌరవ భృతి రూ.3 వేలు, స్టేట్ ద్వారా రూ.3 వేలు మొత్తంగా రూ.6 వేలు వస్తుంటే, దానికి అదనంగా రాష్ట్రం రూ.4 వేలు జత చేసిందన్నారు. ఈ సందర్భంగా ఎల్జీ రాధాకృష్ణన్‌కు, సీఎం రంగసామి, ఆరోగ్య కార్యదర్శి మురుగేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరద నష్టంపై నివేదికలు ఇవ్వండి

మండల ప్రత్యేకాధికారి మూర్తి


కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

అల్లవరం: వివిధ ప్రాంతాల్లో వరద నష్టంపై అధికారులు నివేదిక ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి కరీడి మూర్తి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన వరి పంటలపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు, గ్రామాల్లో పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ, వైద్యాధికారులకు సూచించారు. బోడసకుర్రు, సామంతకుర్రు, గుండెపూడి వాటర్ స్కీమ్‌ల వద్ద నిర్వహణ లోపాలు లేకుండా, ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ బి.కృష్ణమోహన్, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి, వైద్యాధికారి సుమ తదితరులు పాల్గొన్నారు.

రూ.12,700 కోట్లతో బడ్జెట్ సమర్పణ

- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సీఎం రంగసామి
- యానాంలో వివిధ పథకాలకు నిధుల మంజూరు


బడ్జెట్ కేటాయింపులను చదువుతున్న సీఎం రంగసామి

యానాం: ఆర్థిక శాఖను సైతం నిర్వహిస్తున్న పుదుచ్చేరి సీఎం రంగసామి.. రూ.12,700 కోట్లతో 2024–25 బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అనేక సార్లు విజ్ఞప్తులు, కృషితో యానాం నియోజకవర్గానికి సైతం వివిధ పనులు, పథకాలకు గతేడాది కంటే ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించారు. యానాం నియోజకవర్గ పరిధిలో పలు రహదారుల మరమ్మతులతో పాటు, డ్రైనేజీల అభివృద్ధికి ఈసారి నిధులు కేటాయించారు. నాబార్డ్, రాష్ట్ర ప్రభుత్వ నిధులు నాలుగు రీజియన్లలోను రూ.120 కోట్లతో రహదారులను అభివృద్ధి చేయనున్నారు. అమృత్ స్కీమ్–2 ద్వారా యానాంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.11.50 కోట్లతో ఎంఎల్‌డీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు, సాంకేతిక విద్యనభ్యసించిన వారికి కెరీర్ సెంటర్ల ఏర్పాటులో భాగంగా స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో మోడల్ కెరీర్ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్టు ప్రకటించారు. అదేవిధంగా 6 ఎమ్ఎల్‌డీ, 0.5 ఎమ్ఎల్‌డీ సీవెజ్ ప్లాంట్‌ను రూ.28 కోట్లతో యానాం, మాహేల్లో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఆయుష్ ఆసుపత్రిలో అదనంగా సిద్ధా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి

ముఖ్యంగా తీరప్రాంత గ్రామమైన అయ్యన్ననగర్‌లో రూ.22.80 లక్షలతో రహదారులతో పాటు, డ్రైనేజీల అభివృద్ధి చేయనున్నామన్నారు. చైల్డ్‌సేఫ్ ఆన్‌లైన్ పథకం ద్వారా యానాంలో చైల్డ్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం బడ్జెట్‌లో రూ.6,914.66 కోట్లను సొంతంగా పుదుచ్చేరి ఆదాయ వనరులుగా సమకూరుతాయని వివరించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రిలీఫ్ ఫండ్ రూ.3,268.98 కోట్లుగా అంచనా వేసినట్టు తెలిపారు. కేంద్రం నుంచి రూ.20 కోట్లు, కేంద్ర పథకాలకు రూ.430 కోట్లు, ఎన్‌బీసీల ద్వారా రూ.2,066 కోట్లు వస్తాయని అంచనా వేశామన్నారు.

సబ్సిడీ పంపిణీ

వ్యవసాయం, రైతుల సంక్షేమానికి రూ.171 కోట్లు, ఈ ఏడాది నుంచే రేషన్ షాపుల ద్వారా బియ్యం, పప్పులు, పంచదార, ఆయిల్‌ను సబ్సిడీకి పంపిణీ చేస్తామని సీఎం చెప్పారు. పది, ఇంటర్‌లో టాపర్స్‌కు నగదు ప్రైజ్ రీజినల్ లెవెల్‌కు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు సాయం రూ.6,500 నుంచి రూ.8 వేలకు పెంచారు. ఓల్డేజ్ పింఛన్లు నూతనంగా 500 మందికి ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ఆర్ సెల్వం, మంత్రులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భక్తిశ్రద్ధలతో ఏకాదశ హారతులు

తాళ్లరేవు: పవిత్ర మాస శివరాత్రి సందర్భంగా సుంకరపాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారికి ఏకాదశ హారతులు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భీమేశ్వరశర్మ, ప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో పూజాది కార్యక్రమాలు జరిగాయి.

అదనపు అర్హతలతో మరిన్ని సేవలు

యానాం: ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యాలను మెరుగుపర్చుకుని మరిన్ని సేవలందించాలని ఆర్‌ఏఓ మునిస్వామి అన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ(డీఐటీ), పుదుచ్చేరి ద్వారా పాండిచ్చేరి కో–ఆపరేటివ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో మూడు నెలల ఆఫీస్ ఆటోమేషన్ శిక్షణను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కో–ఆపరేటివ్ ఆఫీసర్ రజాక్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో అమలాపురం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి, సంస్థ చైర్మన్ వి.నరేష్ ఓ ప్రకటనలో తెలిపారు. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు ఈ శిబిరం జరుగుతుందని చెప్పారు. లీగల్ లిటరసీ క్యాంపులో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మాచవరం గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి నరేష్ కోరారు.

ఘనంగా లక్ష పత్రి పూజ

ఐ.పోలవరం: ఆషాఢ మాసం మాస శివరాత్రి సందర్భంగా మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో లక్ష పత్రి పూజ, రుద్రహోమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో రుద్ర హోమం, పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజ జరిగాయి. ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.